


నగరేశ్వర స్వామి దేవాలయమునకు వాసవి కన్యకను పల్లక్కిలో వచ్చుట

ఓం హ్రీం శ్రీం

# శ్రీవాసవి కన్యకా దేవి పురాణము

## త్రయోదశాధ్యాయము

కుసుమ శ్రేష్ఠికి వాసవీకన్యక ద్వారా చెప్పబడిన ఆధ్యాత్మిక తత్త్వసారమంతటిని సాలంకాయన మహర్షి వలన వినిన మణిగుప్తాదుల హృదయములు పులకరించినవి. వారు ధన్యత నందినట్లు భావించిరి. తదుపరి ఇతివృత్తమును వివరముగ దెలుపుడని ఉత్సాహయుతులై సాలంకాయనమునిని ప్రార్థించిరి. అంతనా మునివరేణ్యుడు వారితో, "ఓ వత్సలారా! కుసుమార్యుడు శ్రీవాసవీ గీత ప్రబోధనము నంది శాంతనచిత్తుడై

నిదురించిన ఆరాత్రి గడచినది. మరునాటి ఉదయమున వైశ్యశ్రేష్ఠులు కాంతివంతమైనదియు, విశాలమైనదియు, రత్నసముదాయములచే నలంకరింపబడినదియునగు నగరేశ్వరస్వామి మండపమునకు వచ్చిరి. అప్పుడా విషయమును విని కుసుమశ్రేష్ఠియు సంతోషముతో అచటకు బయలుదేరెను. అతడు వాసవీకన్యను పల్లకిలో గూర్చుండబెట్టుకొని వేగమే వచ్చి, భక్తితో నగరేశ్వర స్వామికి ప్రదక్షిణమును జేసి, భాస్కరాచార్యునకు వైశ్యులకు నమస్కరించి ఉచితానుసనమున గూర్చుండెను. వాక్చతురుడైన ఋషిశ్రేష్ఠుడగు భాస్కరాచార్యుడు, పారిపోయినవారు పోగా, మిగిలిన వైశ్యులందరును వీర కంకణధారణమును జేయుడని పలికెను.

## కుసుమశ్రేష్ఠి విషాదయోగము :-

గురుభాస్కరాచార్యుని ఆదేశమును విని ధర్మపురాధిపతి పుత్రుడైన లాభశ్రేష్ఠియను వైశ్యయువకుడు లేచి సభికులందరకు నమస్కరించి ఆనందావేశముతో కూడినవాడై "ఓ గురువరేణ్యా! అగ్నిప్రవేశమునకు నాకు అగ్రతాంబూలము యిచ్చి నాచేత కంకణధారణము చేయింపుడని పలుకుచు త్వరపెట్టెను. ఆ వైశ్యయువకుని చూచి అచ్చటి వారందరును ఆశ్చర్యచకితులైరి. "ఓయీ! నీవు చిన్నవాడవు. నిన్న మొన్న వివాహమైనవాడవు. సంతానములేని వాడవు. నీవు ఆత్మార్పణకు సిద్ధపడుట మంచిదికాదు. ఈ బాల్యచాపల్యమును విడచిపోయిగ జీవింపుము." అని మందలించిరి.

అంత లాభయార్యుడు "ఓ పూజ్యులారా! కులగోత్రముల ప్రమాణము సంతాన హీనులకు, అధిక సంతతిగల వారికి, బాలురకు వృద్ధులకు, ఆరోగ్యవంతులకు, అస్వస్థులకు ఎవరికైనను ఒక్కటియే కదా. అందువలన వీరకంకణధారణకై నాకు ఆనతి ప్రసాదింపుడు" అని గట్టి పట్టుదల వహించి పలికెను. లాభశ్రేష్ఠి త్యాగగరిమను చూచి అబ్బురపడిన ఆచార్యభాస్కరుడు వాని నిర్ణయమును ప్రశంసించి వెంటనే తొమ్మిది పోగులతో కూర్చబడిన దారమును ఆరుతమల పాకులతోను కూడిన తాంబూలమును

ఆ యువకునికి ఇచ్చెను. అపుడు వాసవీకన్యక లేచి "పూజ్యులైన గురుబాల వృద్ధులారా! ఈ యువకుడు తన వంశమునకు ఒక్కడేయున్నాడు. ఇతడు సమస్త వైశ్యకుల గోత్ర ధర్మరక్షణకై ప్రాణములను బలిపెట్టుటకు సంసిద్ధుడయ్యెను. సంతాన హీనుడైన వీనికి కూడ ఉత్తమగతులు ప్రాప్తించవలెను. అందుచే ఇకముందు గణనము కొలగారము, దానము మున్నగు సమస్త కార్యములు ఆచరించు సమయమున వైశ్యులు త్యాగశీలుడైన యీ బాలుని నామమును తొలుతగ సంస్మరించి వారార్జించు పుణ్యఫలములతో కొంచెమీతనికి కూడ చెందునట్లు దానాదుల నొసగవలెను." అని అచ్చటివారికి సూచించినది. వెంటనే కుసుమశ్రేష్ఠి లేచి, వాసవీకన్యక చెప్పిన యీ విధానము యి సకల వైశ్యజాతికి కులాచారమై విలసిల్లగలదు. ఇక ఆర్యవైశ్యులాచరించు దానవిక్రయ గణనాది సమస్త కార్యములలో మొదట "లాభము" అని ఉచ్చరించి ఆ తొలికర్మల పుణ్యఫలములను లాభశ్రేష్ఠికి సమర్పింపుడు అని కట్టడిగావించెను. సకల వైశ్యులు అత్యుత్సాహపరులై తమ అంగీకారమును ప్రకటించిరి.

## వాసవీకన్యక వైశ్యుల అగ్ని ప్రవేశమునకు అర్హతలు నిర్ణయించుట :-

ఆ సమయమున ఆర్యవైశ్యులందరిలో ఉత్సాహము ఉరకలు వేయసాగినది. 102 గోత్రములలోని ఆబాల వృద్ధులందరును తమ ప్రాణములను తృణములుగ భావించి అగ్నిప్రవేశము గావించుటకు నిశ్చయించుకొని "అగ్నియందు నేను ముందు పడుదును నేను ముందు పడుదును." అని కేకలు వేయచూలేచిరి. అంత వాసవీకన్యక వారినందరను శాంతపరచి మృదుమధురములైన వచనములతో "ఓ మహావైశ్యులారా! మీరు ఆవేశముతో సాహసము చేయవలదు. నిరంకుశులైన దుష్టులలోని దుష్టత్వమును త్యాగాహింసల ప్రభావముతో నశింపచేయవలెనన్న సంకల్పముతో మాత్రమే మనమీ అద్భుతమైన ఆత్మత్యాగ మహోద్యమమును చేపట్టినాముగాని వంశనాశనము చేసికొనుటకు గాదు. బిడ్డలు, బంధువులు మొదలగు వారందరును అగ్నిగుండమున

బడినట్లైన కులమంతయు నశించిపోగలదు. అందుచే మీరు చేయదగిన కార్యము నాచే యిప్పుడు విధించబడుచున్నది. "ఓ వైశ్యోత్తములారా! బహువిధ గోత్రములలో పుట్టి మిత్రకళాత్రాదులతో గూడి ధర్మరక్షణకై నడుము బిగించి పూజ్యులై వేల సంఖ్యలో వెలుగొందుచున్న మీలో ఎవరికి నగరేశ్వరస్వామి యొక్క దేవాలయ విమానము మరియు తదితర దేవాలయముల గోపురకలశములు కోటి సూర్యుల కాంతితో ప్రకాశించుచు కనిపించునో అట్టి పుణ్యశీలురు, సంతానవంతులు అయిన వృద్ధ దంపతులు గోత్రమునకు ఒక దంపతులు మాత్రమే నాతో కలసి అగ్నిప్రవేశము చేయవలెను. తదితరులెవ్వరును ఆత్మార్పణలకు సిద్ధపడరాదు. ఇది దేవ్యానతిసుమా" అని ఆదేశించినది. ఆ వాసవీదేవి పలుకులను విన్న వైశ్యులందరు మంత్రముగ్ధులవలె ఆమె ఆనతి శిరసావహించి శాంతించిరి.

అంతట దేవ్యానతి ననుసరించి విమాన గోపురకలశముల అద్భుత దివ్యదర్శనము గావించగలిగిన నూటరెండు గోత్రముల పుణ్యదంపతులు తమ పుత్రులైన బాలనగరులను పిలచి వారిని అనేక విధముల ఆశీర్వదించి "ఓ బిడ్డలారా! మీరు గౌరీనగరేశ్వరుల కృపతో, కోనకమలా జనార్ధనుల దయతో, బ్రహ్మాంశ సంభూతుడైన గురుభాస్కరాచార్యుల ఆదేశానువర్తనులై మన ఇల వేల్పైన వింధ్యవాసినీదేవి రక్షణలో పుత్రపౌత్రాభివృద్ధి నొంది సంపూర్ణ భోగభాగ్యములతో ఆయురారోగ్యములతో, తులదూగుచు బహుకాలము వర్ధిల్లుదురుగాక. మీకు విద్యా వినయసంపదలు చేకూరు గాక. స్వకుల ధర్మాచారపరులై సర్వమత సామరస్యము కలిగి ఆదర్శప్రాయమైన ఐకమత్యముతో విరాజిల్లుదురు గాక. నిరంతరము గురునానతి ననుసరించి నడచుచు ధన్యజీవనులు గండు, ఆర్యవైశ్య వంశకీర్తిని అఖిల ప్రపంచములో అత్యున్నత పథముల విరాజిల్ల జేయుండు" అని ఉపదేశించిరి.

## 102 గోత్రముల ఆర్యవైశ్యులకు సంకేతనామములను ఏర్పరచుట :-

అంత భాస్కరాచార్యుడు త్యాగధనులైన వైశ్య దంపతులను జూచి "ఓ వైశ్యరత్నములారా! మీకిపుడు మిక్కిలి ముఖ్యములైన కొన్ని విషయములను చెప్పుచున్నాను. సావధానులై వినుడు 714 గోత్రములలో మహాసంఘముగ విలసిల్లిన ఆర్యవైశ్యులు యిపుడు రెండు విభాగములుగ చీలిపోయినారు కదా. 612 గోత్రముల వారు వారి పురాకృత దుష్కర్మ ప్రభావము వలన వాసవీకన్యక యొక్క ఉపదేశములను పాటించక, త్యాగము యొక్క అనంత మహత్వమును అరయజాలక, మీ నూటరెండు గోత్రముల వారితో సంబంధములను త్రెంచుకొని వెడలిపోయిరి. అట్టివారి నుండి మహాత్ములు, పుణ్యశీలురైన మిమ్ములను వేరుగ గుర్తించవలసియున్నది. అందువలన మీకు ఋషిగోత్రములతో పాటుగ మర్మములైన సంకేతనామములను కూడా ఏర్పరచుచున్నాను. ఈ సంకేత నామములు ప్రాకృత గోత్రములనబడును. ప్రస్తుతము క్షత్రియపాలకులకును మనకును ఏర్పడి వున్న విరోధము కారణముగను, మన నుండి విడిపోయిన 612 గోత్రముల వైశ్యులలో మనపట్ల కలిగిన వైషమ్యభావ కారణముగను, కలుగబోవు ప్రమాదముల నుండియు, క్షుద్రవిద్యా ప్రయోగముల నుండియు రక్షణ కల్పించుకొనుటకై మీరు తాత్కాలికముగ కొంతకాలము ఋషిగోత్రములను చెప్పుకొనక సంకేత నామములనే కొంతకాలము గోత్రములుగ చెప్పుకొనవలెను. మీరాచరించు వేదోక్తకర్మలకు బదులుగ అత్యవసర పరిస్థితులలో ఆచరణ యోగ్యములైన పురాణోక్తకర్మలు కూడా యిప్పుడు మీకై ఏర్పరచబడినవి. ఈ ఏర్పాట్లన్నియు విపత్కర పరిస్థితులలో గావింపబడు తాత్కాలికములైన ఏర్పాట్లని గుర్తింపుడు.

పూర్వము గోకర్ణ వివరము నుండి వెలువడిన మీ పూర్వుల నామములను ఆధారముగ చేసుకొని మీ ప్రాకృతి గోత్రములు లేక సంకేతనామములు

రూపొందించబడినవి. కనుక అవి ప్రాకృతములైనను పావనములనియే భావించవలెను కాని వానిని సామాన్య వ్యవహారములందు మాత్రమే చెప్పుకొనవలెను. శ్రౌతస్మార్తాది వైదిక సంస్కార కర్మలయందును పూజాది సందర్భములయందును ఋషిగోత్రములచే చెప్పుకొనవలెను. యిపుడిక, మీ ఋషిగోత్రములను వాని సంకేత నామములను అగ్నిప్రవేశము చేయవలసిన పుణ్యదంపతులను సవివరముగ తెలియజేయుచున్నాను సావధానులై వినుడు.

1. ఓ వైశ్యోత్తములారా! అగస్త్యసగోత్రము వారికి అనుపాల-అనుపాలకుల-అనుపకుల అనునవి సంకేతనామములు. అగ్ని ప్రవేశముగావించవలసిన పుణ్యదంపతులు అభిరామాంబ, రామచంద్రార్యుడు.

2. ఆచ్ఛాయనసగోత్రము వారికి అగ్రమూల, అర్ఘ్యమూల, - అమల అనునవి సంకేతనామములు. అగ్ని ప్రవేశము గావించవలసినవారు రాజముఖి, రాజార్యుడు.

3. ఆత్రేయసగోత్రము వారికి అరిశిష్ట-అరస-అరిశెట్ల-ఎలిశిష్ట-హరిశిష్ట అనునవి సంకేతనామములు. ఆత్మార్పణ జేయవలసినవారు బ్రహ్మాంబ, బాలార్యుడు.

4. ఉగ్రసేనసగోత్రముల వారికి కుమారశిష్ట-కొమరశిష్ట-కొమిరిశెట్ల-ఉగ్రశిల అనునవి సంకేతనామములు. అగ్ని ప్రవేశము గావించవలసిన పుణ్యదంపతులు రాజ్యలక్ష్మీ ద్రవిణరాజు.

5. ఔచిత్యసగోత్రము వారికి యనస-యానసఖి అనునవి సంకేతనామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు పుష్పాంజలి, భువనాధిపుడు.

6. ఉత్తమౌజస గోత్రము వారికి ఉతకాల-ఉత్తమ-ఉతశిష్ట అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు కీర్తికాంత, ఉత్పలాక్షుడు.

7. ఉత్కృష్టన గోత్రము వారికి కన్య-క్రాను అనునవి సంకేతనామములు. అగ్ని ప్రవేశము గావించవలసిన వారు సమదర్శిని. సోమదుడు.

8. ఋష్యశృంగసగోత్రమువారికి అనంత, ఆనంత అనునవి సంకేత నామములు-ఆత్మార్పణ చేయవలసినవారు భీమాంబ, పృధివీశుడు.

9. కపిలస గ్రోత్రము వారికి-మండ-మంద అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ గావించవలసినవారు పల్లవాంబ, పాలాహ్వాయుడు.

10. కపీతసగోత్రము వారికి వెంకోల-వెంకాల-వెంకాకుల అనునవి సంకేత నామములు. అగ్ని ప్రవేశము గావించవలసిన వారు రాగమంజరి, రాగాఖ్యుడు.

11. కణ్వసగోత్రమువారికి కాటు-కోట-కర్ణాట-కమట-కరుణ-కటాంట అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు చిత్రభాషిణి, చిత్తశుభగుడు.

12. కాశ్యపసగోత్రము వారికి గణముఖి-గణప-గణవక్త్ర-అనునవి సంకేత నామములు. అగ్ని ప్రవేశము గావించవలసిన పుణ్యదంపతులు నారీమణి, నాగాఖ్యుడు.

13. కృష్ణసగోత్రము వారిక ధనద-ధేను-ధన అనునవి సంకేతనామములు. అగ్నిప్రవేశము గావించవలసిన వారు అమృతభాషిణి-గౌతముడు.

14. కౌత్స/కుత్ససగోత్రము వారికి ఇక్ష్వాకు-కదంబకుల అనునది సంకేత నామములు. ఆత్మార్పణ గావించవలసినవారు ధనలక్ష్మీ, ధనుదుడు.

15. కౌశికసగోత్రము వారికి కరకపాల-కరపాల-కనకపాల-అనునవి సంకేతనామములు-అగ్నిప్రవేశము గావించవలసిన పుణ్యదంపతులు ధర్మాంబ, ఉత్తమాహ్వాయుడు.

16. కందర్పసగోత్రము వారికి చర-చేగొడ్డ-చేగొళ్ళ-మన-చేరుకొళ్ళ-శ్రేష్ఠ కుండల-చేగొండ అనునవి సంకేతనామములు. ఆత్మార్పణ జేయవలసిన వారు బాలామణి, బలదేవుడు.

17. కౌండిన్యసగోత్రము వారికి ఘనశ్రీల-ఘనలోల అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసిన వారు చంద్రముఖి, పుతాత్ముడు.

18. కౌంతేయసగోత్రము వారికి కామశిష్ట-కామిశెట్ల అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసిన వారు రుక్మవతి, పావనశ్రేష్ఠి.

19. గార్గ్యసగోత్రము వారికి ప్రహిణి-ప్రహీణు-పైడి-ప్రహణశీల-పమిడి అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసిన వారు పల్లవాంబ, మల్లాఖ్యుడు.

20. గృత్సమదసగోత్రము వారికి ఇనుప-ఇషువ-అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు విచక్షణాంగి, దక్షిణాహ్వాయుడు.

21. గౌతమసగోత్రమువారికి గ్రంథిశిల-గంధశీల-అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు జాహ్నవి, జమదగ్ని.

22. గోపకసగోత్రము వారికి ఇంచు-ఇంచుపాహ్వాయం-గోప-గోంటు-గోటు-గుంట-గోరంట-ఘోటక అనునవి సంకేతనామములు. ఆత్మార్పణ జేయవలసినవారు చంద్రరేఖ, శృంగుడు.

23. చక్రపాణిసగోత్రమువారికి చక్రమూల-చక్రమూలస అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసిన వారు కళావతి, చంద్రాఖ్యుడు.

24. చామర్షణసగోత్రము వారికి పెద్దశ్రేష్ట-పెద్దశిష్ట-బుధశిష్ట-అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసిన వారు నీడాంబ, నందాఖ్యుడు.

25. జడభరతసగోత్రము వారికి దూరశిష్ట అనునది సంకేతనామము. అగ్ని ప్రవేశము గావించవలసిన వారు పల్లవపాణి, వల్లభుడు.

26. జతుష్కర్ణసగోత్రము వారికి చంద్రమూల-చంద్ర-చంద్రశిష్ట-చంద్ర మాలాఖ్య-చందా-చంద్రకాహ్వాయ అనునవి సంకేతనామములు. ఆత్మార్పణ జేయవలసినవారు అనుమిత, అనంతుడు.

27. జాబ్రే /జాబ్రేయసగోత్రము వారికి చనశిష్ట-చనిశెట్ల-చెన్నశిష్ట, శినిశెట్ల, శెనిశెట్ల, చిన్నిశిష్ట అనునవి సంకేతనామములు. ఆత్మార్పణ జేయవలసినవారు తారకాంబ, వామనుడు.

28. జరత్కారసగోత్రము వారికి చన్న-జాన-జ్యాను-జనక-అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు విమలాదేవి, కంపిణుడు.

29. జాబాలిసగోత్రము వారికి సూరిశిష్ట, అనునది సంకేతనామము. ఆత్మార్పణ జేయవలసిన వారు అభినవాంబ, అమలుడు.

30. జీవంతిసగోత్రము వారికి భ్రూమశిష్ట-భ్రూతిలాశిష్ట-వృద్ధి అనునవి సంకేతనామములు. అగ్ని ప్రవేశము గావించవలసినవారు కనకాంగి, కుముదార్యుడు.

31. జాంబ సూదనస గోత్రమువారికి త్రిమూల అనునది సంకేతనామము. ఆత్మార్పణ జేయవలసిన వారు పోతాంబ, భోగఖ్యుడు.

32. తరుణసగోత్రము వారికి త్రివిక్రమశిష్ట-త్రివిక్రమ అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు ఇందుముఖి, ఇందాఖ్యుడు.

33. తిత్తిరిస గోత్రమువారికి భ్రమద-భ్రమర-భ్రవద-బ్రహ్మకుల-అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ గావించవలసినవారు కమలాదేవి, గుణసత్త్వుడు.

34. శైత్రేయసగోత్రము వారికి చిదురంబిళ్ళ-చిదురుపేళ్ళ-చిద్రాప-చిదుబిళ్ల-చతురపేళ్ల అనునవి సంకేతనామములు. అగ్నిప్రవేశము గావించవలసిన వారు భ్రమరాంబ, దంతగుప్త.

35. త్రిజటసగోత్రము వారికి ఉసిరి-ఉపర-ఉప్పాల, ఉనరి-ఉసీర అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు చంచలాక్షి, పావనుడు.

36. దాల్భ్యసగోత్రము వారికి ఫటనశిష్ట పలనమశిష్ట-పటిన-ఫలక అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసిన వారు మంజువాణి, సుందరుడు.

37. దూర్వాసగోత్రము వారికి దిదిశ-దిదన-దెంతాశుల-దంత-దాంత అననవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు అర్కాంబ, మల్లాఖ్యుడు.

38. దేవతారస గోత్రము వారికి హిరరాశి-హిరాకుల-హీరీత-హీరరాజు సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు కుందరదన, గోవిందుడు.

39. దేవవల్క్యస గోత్రము వారికి దేశిష్ట-దేవశెట్ల-దైవశిష్ట అనునవి పాలకుల-పాలక-పాలక్రపాల అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు అబ్జముఖి, జమదగ్ని

40. నారదసగోత్రము వారికి పాలకుల-పాలక-పాలక్రపాల అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు కమలాక్షి, సముద్రాఖ్యుడు.

41. నేత్రపాదస గోత్రము వారికి చందోగు, చెందోగుల అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు ధరణీదేవి, కుమారశ్రేష్ఠి.

42. పల్లవసగోత్రము వారికి గణప, ఘంటకాహ్వాయ-ఘంటాశుల-ఘంట స్థూల-అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు ధనలక్ష్మీ ధనదగుప్త.

43. పరస్పరాయణసగోత్రము వారికి తువ్విశిష్ట-శ్రీపుంశిక-పొలస్త్య- పొలశ్చ-శ్రీపుంశ అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు హల్లకాంబ. పార్థివార్యుడు.

44. పవిత్రపాణిసగోత్రము వారికి దయశిష్ట-దశిష్ట-ధైశెట్టి-ధైశెట్ల అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు లోలాంబ, లోకాహ్వాయుడు.

45. పారాశర్యసగోత్రము వారికి కామధేను-వడగశిల-పాంచాల-ప్రాణాసుల-ప్రౌఢశిల-పాపాల-పాంబాల-ప్రాగ్భాల-ప్రాణు-పావళ్ల అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు కమలావతి, గౌరాఖ్యుడు.

46. ప్రాచీనసగోత్రము వారికి విశిష్ట-వెనశిష్ట-వెనిశెట్ల అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు మోహిని, పవిత్రపాణి.

47. ప్రాభాతసగోత్రము వారికి ఉద్వాహ-రవిశిష్ట అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు కుసుమాంబ, కుసుమశ్రేష్ఠి.

48. పూతిమాషసగోత్రము వారికి-తోట-తులసి-తుర్యాట-తులిశెట్ల-తునిశెట్ల-తులశిష్ట అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు తను మధ్య, ధృవసత్వుడు.

49. పౌలస్త్యస గోత్రము వారికి గోశీల-ఉత్తమగోశీల-పల్లవగోశీల-వటుగోశీల-పునగశీల అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు సుబోధిని, సింహసేనుడు.

50. పింగసగోత్రము వారికి అయనకుల ఐన-అనయ అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు సౌదామిని, బంభరుడు.

51. పుండరీకస గోత్రము వారికి అనుశిష్ట అనునది సంకేత నామము. అగ్నిప్రవేశము గావించవలసినవారు చంద్రకళ, చంద్రమౌళి.

52. పౌండ్రకసగోత్రము వారికి పోలిశెట్టి ప్రోలి-పూసికకుల-పుంశిమాంశు -ప్రోశిష్ట-ప్రోలేఖ-ప్రోలిశిష్ట అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు సుదర్శిని. సౌదాఖ్యుడు.

53. బృహదశ్వసగోత్రము వారికి ఫేరిశిష్ట-పైరుశిష్ట-పేరిశెట్ల-పెరిష్ట అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు బలాంబ, జనార్ధనుడు.

54. బోధాయనస గోత్రము వారికి బుద్ధి-బుధన-బుధంకుల అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు దంతవతి, అమృతుడు.

55. భారద్వాజసగోత్రము వారికి బలిశిష్ట-బలశ్రేష్ట-బలిశెట్ల అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసిన పుణ్యదంపతులు సమశీల, సకలాఖ్యుడు.

56. భార్గవసగోత్రము వారికి పృథ్విశ్రేష్ట-పృథ్విశిష్ట అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు చిత్రరేఖ, కుశలార్యుడు.

57. మరీచిసగోత్రము వారికి దీక్షమ-దీక్షమశిష్ట-దీక్షమశ్రేష్ట-దీక్షమ శిష్టస అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు ధనవతి, ధర్మాఖ్యుడు.

58. మానవసగోత్రము వారికి మన్న్య-మన్న్యస-మానస-మానాచ్ఛ- మనాభ అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు మణిమంజరి, ఆదిత్యగుప్త.

59. మార్కండేయసగోత్రము వారికి మోరు మోర్కాలు-మోరుక-మోరుస- మూర్ఖల మూర అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు శ్యామలాంబ, కృష్ణుడు.

60. మునిరాజసగోత్రము వారికి పద్మశిష్ట-పద్మశ్రేష్ఠ-పద్మశిష్టస-పద్మశెట్ల- పద్మశిల అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు సరస్వతి, సరసశ్రేష్ఠి.

61. మైత్రేయసగోత్రము వారికి మిధున-మద్ధి-మధ్యస-మదన-మైత్రి- మష్య అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసిన వారు కాళీవతంస, కాలకంఠుడు.

62. మౌద్గల్యససగోత్రము వారికి నాభీలకుల-నాభీలస-మునికుల- మూలకుల అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు మేధాంబ, మార్కండేయులు.

63. మౌసలసగోత్రము వారికి చందకుల-చందక-చంగాల-చందాల అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు హేమరేఖ, స్వర్ణరధుడు.

64. మందపాలస గోత్రము వారికి విన్నస-విను-వెన్న అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు భామామణి, భాస్కరాచార్యుడు.

65. మౌంజాయనసగోత్రము వారికి మౌంజస-ముంజిక అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు మణిశలాక, కందర్పుడు.

66. యాస్కసగోత్రము వారికి వెలిగోళ్ళ-వ్యాళకూలస అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు పృధ్విదేవి, పృధునామగుప్త.

67. యాజ్ఞవల్క్యస గోత్రము వారికి అభిమంచి-అభిమన్యు-అభిముంచ - అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు ధనదాంబ, మూలార్యుడు.

68. వటుకసగోత్రము వారికి అనుమర్షణ అనునది సంకేత నామము. అగ్నిప్రవేశము గావించవలసినవారు ప్రోల్లాసిని, పుణ్యరాశిగుప్త.

69. వరతంతుసగోత్రము వారికి మాసంత-మాషాంత-మాంత అనునవి సంకేత నామము. అగ్నిప్రవేశము గావించవలసినవారు బింభాదరి, పీనవక్షార్యుడు.

70. వరుణసగోత్రము వారికి వెలిశిష్ట-వరుణశిల-ఏలశిష్ట అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు వల్లవాంబ, బోగాఖ్యుడు.

71. వసిష్టసగోత్రము వారికి వస్తిస, వస్త్రకుల-వస్తుకుల అనునవి సంకేత నామము. అగ్నిప్రవేశము గావించవలసినవారు హేమాంగి, మత్స్యధ్వజార్యుడు.

72. వామదేవసగోత్రము వారికి ఉపన-ఉపలాల-ఉపమన్యు-ఉపనాహ్వాయ అనునవి సంకేత నామము. అగ్నిప్రవేశము గావించవలసినవారు దేవాంబ, భోగార్యుడు.

73. వాయువ్యసగోత్రము వారికి వ్రంగమ-వ్రక్కాల-ప్రకశిష్ట-వ్రంగమూల -వ్రంగమ-అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు భూమాంబ, బ్రహ్మార్యుడు.

74. వాల్మీకిసగోత్రము వారికి సాంతాల-శాంతి అనునవి సంకేత నామము. అగ్నిప్రవేశము గావించవలసినవారు విదురాంబ, మాధ్యవార్యుడు.

75. వాసుదేవసగోత్రము వారికి భీమశిష్ట-భీమశ్రేష్ట-భీమశిల అనునవి సంకేత నామము. అగ్నిప్రవేశము గావించవలసినవారు ఇభయాన, నాగార్యుడు.

76. వ్యాసగోత్రము వారికి ధనద-ధనగుండ-ధనగు-ధనిగుళ్ళ-ధనకుల అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు మంజువాణి, గుణపుంజగుప్త.

77. విశ్వామిత్రసగోత్రము వారికి విక్రమశిష్ట-విక్రమశెట్ల అనునవి సంకేత నామము. అగ్నిప్రవేశము గావించవలసినవారు కంబుకంఠి, కపిలార్యుడు.

78. విష్వక్సేనసగోత్రము వారికి విపరిశిష్ట-పిబరిశెట్ల-ఉపరిశిష్ట అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు సోమప్రభ, సింహధ్వజుడు.

79. విష్ణువృద్ధసగోత్రము వారికి పుష్పాలకుల-పిప్పలాది, పేసల అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు వాసంతిక, అర్ధనారీశుడు.

80. వైరోహిత్యసగోత్రము వారికి వసంతకుల-వసంతకకుల అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు పిప్పలాంబ, నాగధ్వజుడు.

81. శరభంగసగోత్రము వారికి క్రమశిష్ట-కాశెట్ల అనునవి సంకేత నామము. అగ్నిప్రవేశము జేయవలసినవారు నీలవేణి, భానుగుప్త.

82. శార్ఙ్గరవసగోత్రము వారికి గోండక-గుండక-గుండుకుల అనునవి సంకేత నామము. అగ్నిప్రవేశము గావించవలసిన పుణ్యదంపతులు కృష్ణాంబ, నాగార్యుడు.

83. శుక్లసగోత్రము వారికి ముష్టి-శ్రీసాళ్ళ-శ్రీశాల-శ్రీకాళ్ల-శిరిసాల- శిరిపెల్ల అనునవి సంకేత నామము. అగ్నిప్రవేశము గావించవలసిన వారు విన్నమాంబ, విశ్వనాధుడు.

84. శ్రీధరసగోత్రము వారికి శ్రీశిష్ట-శిరశిష్ట అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు నవనీతాంగి, విన్నార్యుడు.

85. శ్రీవత్ససగోత్రము వారికి శ్రీలకుల-శ్రీరంగ-చిలకుల-అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు ప్రభావతి, ప్రద్యుమ్నుడు.

86. శాచేయసగోత్రము వారికి ఇలమంచి-యలమంచి-హేలమంచి- తులమంచి అనునవి సంకేత నామము. అగ్నిప్రవేశము జేయవలసినవారు మేధాంబ, వీరభద్రుడు.

87. శౌనకసగోత్రము వారికి కమలకుల తృకశిష్టకుల-శనకాలకుల-శౌనక అనునవి సంకేత నామము. అగ్నిప్రవేశము చేయువలసినవారు గంగాభవాని, విద్యాధరగుప్త.

88. శాండిల్యసగోత్రము వారికి తుప్పాలకుల అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు పుష్పదాంబ, విదార్యగుప్త.

89. సనకసగోత్రము వారికి సాన-సన్నకుల అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ గావించవలసినవారు సుందరీదేవి, జీముతార్యుడు.

90. సనందనసగోత్రము వారికి సోమశిష్ట-సంశెట్ల అనునవి సంకేత నామము. అగ్నిప్రవేశము జేయవలసినవారు ఉత్పలాక్షి, పండితార్యుడు.

91. సనత్కుమారసగోత్రము ఠంకారకుల-ఢంకారకుల-ముద్దుకుల అనునవి సంకేత నామము. అగ్నిప్రవేశము జేయవలసినవారు రాజముఖి, రాజేశ్వరుడు.

92. సౌవర్ణసగోత్రము వారికి సూసాళ్ళ-సకాళ్ల-సుసోళ్ళ-సుశాల అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు లీలావతి, జనార్ధనగుప్త.

93. సంవర్తకస గోత్రము వారికి రెంటకుల-రెంటస- అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు పద్మగంధి, బాలభానుగుప్త.

94. సత్యవ్రతస / సత్యసగోత్రము వారికి చింతక చింత్య-చింతమ-చింతశిష్ట-చింతాల-అందిర అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు చిత్రాంగి, విన్నవరేణ్యగుప్త.

95. సుకాంచనసగోత్రము వారికి పునీత-పుచ్ఛకుల-పుచ్ఛకశిల-పౌచ్ఛకుల - అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు సత్యవతి, సత్యసంధుడు.

96. సుతీక్ష్ణసగోత్రము వారి దంతకుల-దొంతకుల-ద్యంతకుల-ద్వంతకుల-దెంతకుల-దేవిశెట్ల అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు చంద్రాంబ, జలదార్యుడు.

97. సుబ్రహ్మణ్యసగోత్రము వారికి చందచందన-స్నిగ్ధ అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు చపలాక్షి, సింహముఖుడు.

98. సువర్ణసగోత్రము వారికి ప్రౌఢయాచ ప్రౌఢశిల-ప్రోఢయాజ-ప్రోఢయాచ-ప్రాణయాజ-ప్రయపనస అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు పద్మాక్షి, మేఘసేనుడు

99. సుందరసగోత్రము వారికి ఇనుకుల-ఇనకాల-వినికోల అనునవి సంకేత నామములు. అగ్నిప్రవేశము గావించవలసినవారు పావనీదేవి, చంద్రబాణుడు.

100. సౌపర్ణసగోత్రము వారికి బుధురుకుల-బుధరుక్స-బుధర్కుల, బుధరకుల - బుధర అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు మణిమాల, గణముఖార్యుడు.

101. సౌమ్యసగోత్రము వారికి హస్తికుల, హసిక్త అనునవి సంకేత నామములు. ఆత్మార్పణ జేయవలసినవారు దావనదేవి, నిర్జల సేనుడు.

102. హరివల్కస గోత్రము వారికి కురట–కోరట–కపట అనునవి సంకేత నామము. అగ్నిప్రవేశము జేయవలసినవారు కుముదపల్లి, సుదర్శన శ్రేష్ఠి.

అని భాస్కరాచార్యుడు నూటరెండు గోత్రముల ఆర్యవైశ్యులకు వారి ఋషిగోత్రములను నూతనముగ ఏర్పరచిన సంకేతనామములను మరియు అగ్ని ప్రవేశము చేయవలసిన పుణ్యదంపతుల పేర్లను సవివరముగ తెలియజేసెను.

అటుపై ఆర్యవైశ్యులు సామాన్య వ్యవహారములలో మాత్రమే సంకేత నామములైన ప్రాకృత గోత్రములను చెప్పుకొనవలెననియు, శ్రౌతస్మార్తాది సకల వైదికకర్మల యందు ఋషి గోత్రములను మాత్రమే చెప్పుకొనవలెననియు కట్టడిగావించెను. గురవరేణ్యుని వాక్యములను విన్న వైశ్యులు వారి ఆదేశములను శిరసావహింతుమని పలికిరి.

## ఆర్యవైశ్యులు ఆత్మత్యాగ ముహూర్త నిర్ణయము - అగ్నికుండముల నిర్మాణములు:-

అనంతరము ఆదిభాస్కరగురువరేణ్యుడు ఆర్యవైశ్యుల అగ్నిప్రవేశమునకై మాఘశుద్ధ విదియ గురువారమునాడు ముహూర్తము నిర్ణయించెను. అటుపై వైశ్యులను జూచి "ఓ వైశ్యోత్తములారా! సద్యోజన విస్తీర్ణమైన బ్రహ్మకుండ ప్రదేశమున పూర్వము దేవతల చేత కుమారస్వామి కొరకై అగ్నిచక్రము యేర్పరుచబడినది. ఆ ప్రదేశములో అసువులు అర్పించిన వారు తప్పక పరమ పదమును పొందగలరు. అందువలన మన అగ్ని ప్రవేశ మహా యజ్ఞమునకు అదియే అనువైనతావు" అని చెప్పి స్థల నిర్దేశము గావించెను.

పిమ్మల మల్హారుడను భటుని పిలిచి "ఓయీ మల్హారా! నేను చెప్పెడు ప్రకారము నీవక్కడ అగ్నికుండములను నిర్మింపుము. మధ్యభాగమున శ్రీ వాసవీకన్యకకై

ప్రధానకుండ నిర్మాణము గావింపుము. దానికి ఒక పార్శ్వమున తొమ్మిది కుండములు, మరియొక పార్శ్వమున తొమ్మిది కుండములు, ప్రధాన హోమకుండపు నాలుగుమూలలందు నాలుగు కుండములను, అటుపై వర్తులాకారములో 16 కుండములను, శాలయొక్క నాలుగుమూలలలో అరువది నాలుగు కుండములను నిర్మింపుము. పూర్వము బ్రహ్మచేత యీ విధముగనే కుండనిర్మాణము గావించబడినది అని భాస్కరాచార్యుడు మల్హారునకు తెలియజేసెను.

## విష్ణువర్ధనునకు శాపప్రాప్తి :-

అగ్నిప్రవేశమునకు భాస్కరచార్యుడు స్థలనిర్దేశముగావించిన తదుపరి కొందరు వైశ్యులు వాసవీకన్యకను జూచి "అమ్మా! క్రూరుడైన చక్రవర్తి మన అగ్నిప్రవేశ వార్తను వినియు మనస్సు మార్చుకొనక మనపైకి దండెత్తి వచ్చినచో మనము యీ అహింసావ్రత దీక్షనెట్లు పాటింపగలము? మనము అహింసావ్రత దీక్షాబద్ధులమై ఊరకుండినచో ఆర్యవైశ్యకులము ఆత్మరక్షణ గావించుకొనుటెట్లు?" అని ప్రశ్నించిరి. అంత వాసవీకన్యక వారిని చూచి సోదరులారా! ధైర్యమును విడనాడకుడు. పూర్వము శ్రీ మహావిష్ణువు కొరకై తపశ్చర్యలో వుండిన వేదవతిని మదోన్మతుడైన రావణాసురుడు బలిమిని పట్టుకొనిపోగా, ఆమె వానిని చూచి "ఓరి ధర్మద్వేషి! నా యీ శరీరమును యోగాగ్నిలో దగ్ధము చేసికొని, రాగల జన్మమున నీ గృహములో ప్రభవించి నిన్ను పుత్ర బంధు మిత్ర సపరివారముగ సర్వనాశనము చేసెదను." అని శపించి అగ్నిలో దగ్ధమై పోయినది. మానవతులైన స్త్రీలు పాపాత్ములైన వారి దురాగతములను సహించరు. అట్లే పాపాత్ముడైన విష్ణువర్ధనుని దుష్టమైన చూపులు సోకిన నా యీ శరీరమును అగ్నిలో విడిచివేసెదను. ఆ దుష్ట సార్వభౌముడు పెనుగొండ పట్టణమును సమీపింపజాలడు అని వాసవి పలుకుచుండగ, ఆకసము నుండి ఒక దివ్యవాణి "ఓ వైశ్యవరులారా! శ్రీ వాసవీ కన్యకాదేవి యొక్క అగ్ని ప్రవేశవార్త చెవిని పడినంతనే, వజ్రాయుధముతో ఛేదింపబడిన పర్వత

శిఖరమువలే విష్ణువర్ధనుని తల వేయి వ్రయ్యలుగ  ప్రీలిపోగలదు. ఇది తథ్యము తథ్యమని దశదిశలను ఘోషింపజేయుచు మేఘగంభీర నిస్వరముతో వినిపించెను. ఆ వాక్కును విని అచ్చటివారందరును పరమాశ్చర్యమును పొందిరి. వాసవీదేవి మహిమను కీర్తించుచు ఆ వైశ్యులు భాస్కరదేశికుని జేరి వీరకంకణములు కట్టించుకొని తాంబూలములను స్వీకరించి సంతోషయుక్తులై కవిపండిత స్తోత్రపాఠకాదులచే కీర్తింపబడుచు తమ తమ గృహములకు బోయిరి.

అని యిట్లు మణి గుప్తాది వైశ్యులకు సాలంకాయనుడు చెప్పుచుండగ వారా గురువరేణ్యునితో "ఆచార్యసత్తమా! ఆర్యవైశ్యులు యిట్లు అగ్ని ప్రవేశ ప్రయత్నములు చేయుచుండినప్పుడు విష్ణువర్ధనుని సేనాధిపతియైన విక్రమ కేసరియు వాని సేనలును చూచుచు వూరకుండిరా? వారేమి చేసిరి? అని ప్రశ్నించిరి. అపుడు సాలంకాయనుడు "ఓ వైశ్యోత్తములారా! సార్వభౌమునిచేత కాపుంచబడిన సైనికులందరును వైశ్యుల త్యాగనిరతిచే ప్రభావితులై వాసవీ భక్తులుగ మారిపోయిరి. వారు తమ నాయకుడైన, విక్రమకేసరి ఆజ్ఞలను తిరస్కరింపసాగిరి. చక్రవర్తి యొక్క నిరంకుశత్వమును నిరసించిరి. అంత విక్రమకేసరి తమకు విధేయులైన దూతల ద్వార వైశ్యుల అగ్నిప్రవేశమును గూర్చిన వార్తను విష్ణువర్ధన చక్రవర్తికి పంపించెను. అతడు భేదోపాయముతో వాసవీ బాలను బంధించి తన ప్రభువునకు సమర్పించవలెనని నిశ్చయించుకొని అదనుకొరకై ఎదురు చూడసాగెను." అని చెప్పెను. మణిగుప్తాదులు యినుమడించిన కుతూహలముతో సాలంకాయనుని కథనమును వినసాగిరి.